

కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. ఉత్తుంగతరంగమై దూసుకొస్తోంది. నాగార్జున సాగర్ నుంచి భారీ వరద పోటెత్తడంతో అటు పులిచింతల, ప్రకాశం బ్యారేజీతో పాటు ఇటు పులిగడ్డ అక్విడెక్టు వద్ద ప్రవాహం ప్రమాదకరస్థాయికి చేరింది. వరద ప్రవాహానికి పాత యడ్లంక కాజ్‌వే కొట్టుకుపోయింది. ఇక లంక గ్రామాల్లోకి వరద నీరు చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పేదలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.



ప్రకాశం బ్యారేజీకి భారీగా చేరిన వరద నీరు

ఉధృతంగా..

కృష్ణానదికి భారీగా వరద నీరు

- నిండుకుండలా పులిచింతల ప్రాజెక్టు
- ప్రకాశం బ్యారేజీ వద్ద ఉరుకులు పరుగులు
- పులిగడ్డ అక్విడెక్టు వద్ద ప్రమాదకరస్థాయి..
- కొట్టుకుపోయిన పాత యడ్లంక కాజ్‌వే
- లంకగ్రామాలను అప్రమత్తం చేసిన అధికారులు
- తీర ప్రాంతాల్లో భారీ భద్రత
- విజయవాడలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విజయవాడ/ మచిలీపట్నం, ఆగస్టు 8 : 2.54 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటంతో డెడ్ స్టోరేజ్‌లో ఉన్న పులిచింతల ప్రాజెక్టు నిండుగా కనిపిస్తోంది. 11 గేట్లను 2.5 మీటర్ల మేర పైకెత్తి 2లక్షల42వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం మొత్తం 45 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం 35 టీఎంసీల మేరకు నీటి నిల్వలు చేరుకున్నాయి. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం వరకు నీటి నిల్వలు పెంచాలని అధికారులు భావించినప్పటికీ సీడబ్ల్యూసీ నుంచి వచ్చిన ఆదేశాలతో పది టీఎంసీల ఖాళీని ప్రాజెక్టులో కొనసాగిస్తున్నారు. ఇక.. ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజీకి 3లక్షల10వేల88 క్యూసెక్కుల నీరు వస్తోంది. పులిచింతల నుంచి 2లక్షల44వేల61 క్యూసెక్కుల వరద చేరుతోంది. ఇదికాకుండా పాలేరు నుంచి 254 క్యూసెక్కులు, కీసర నుంచి 54,522 క్యూసెక్కుల నీరు వస్తోంది. బ్యారేజీ 70 గేట్లలో 60 గేట్లను ఏడడుగుల మేర, పది గేట్లను ఎనిమిది అడుగుల మేర ఎత్తారు. బ్యారేజీ నుంచి 2లక్షల96వేల320 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. కాల్వలకు 13,768 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. కేఈబీకి 11,407 క్యూసెక్కులు, బందరు కాల్వకు 1,011, ఏలూరు కాల్వకు 1,302, రైవస్ కాల్వకు 4,521, కేడబ్ల్యూకు 5,527 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. మరో రెండు రోజులపాటు ఈ పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ప్రకాశం బ్యారేజీకి వరద వచ్చినప్పుడు నదీ పరివాహక ప్రాంతానికి సమీపంగా ఉన్న కృష్ణలంక, రాణిగారితోట, గీతానగర్ ప్రాంతాలు నీట మునిగేవి. ఈ ప్రాంతాలను ఆనుకుని రిటైనింగ్ వాల్ నిర్మించడంతో ఈ ముంపు తప్పింది. అయినప్పటికీ వీఎంసీ అధికారులు కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు.



అక్కపాలెం పడమటి వాగులో నీటి ప్రవాహం



కొట్టుకుపోయిన పాతయండ్లక కాజ్‌వే

ముంపు ముంగిట.. భయం గుప్పెట్లో లంక గ్రామాలు

6లో..

తీరంలో కల్లోలం



పులిగడ్డ అక్విడెక్టు వద్ద వరద ఉధృతి

పులిగడ్డ అక్విడెక్టు వద్ద 9 అడుగుల మేర వరద ప్రవహిస్తోంది. వరద కారణంగా అవనిగడ్డ నుంచి పాతయండ్లకకు వెళ్లే కాజ్‌వే కొట్టుకుపోయింది. దీంతో పాతయడ్లంక గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. అవనిగడ్డ తహసీల్దార్ మురళీధర్ గ్రామస్తులను అప్రమత్తంచేసి పరిస్థితిని ఎప్పటికపుడు సమీక్షిస్తున్నారు. మోపిదేవి మండలంలోని ఉత్తర చిరువోలులంక, అయోధ్య గ్రామాల వద్ద కరకట్ట వెంబడి, షట్టర్లు ఉన్న ప్రాంతాల్లో, కరకట్ట కోతకు గురైనచోట్ల, లాకులు ఉన్న ప్రాంతాల్లో ఇసుక కట్టలు వేసి వరదనీరు గ్రామాల్లోకి ప్రవేశించకుండా అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. పులిగడ్డ అక్విడెక్టు వద్ద నదిలోని నీటిమట్టానికి, అక్విడెక్టుకు మధ్య నాలుగు అడుగుల మేర జాగా మాత్రమే ఉంది. అవనిగడ్డ మండల పరిధిలోని కొత్తపేట, యడ్లంక, దక్షిణ చిరువోలులంక, రేగుల్లంక, మోపిదేవి మండలం బొబ్బర్లంక, కే-కొత్తపాలెం గ్రామస్తులను అధికారులు అప్రమత్తం చేశారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం నుంచి గుంటూరు జిల్లా గాజుల్లంకకు ప్రజలు రాకపోకలు సాగించకుండా తహసీల్దార్ విజయప్రసాద్ నేతృత్వంలో పోలీస్ పికెట్ నిర్వహిస్తున్నారు. పెనమలూరు మండలంలోని యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాలకు చెందిన రైతులు లంకభూముల్లోకి వెళ్లొద్దని రెవెన్యూ, పోలీస్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. తోట్లవల్లూరు మండలంలోని తోడేళ్లదిబ్బ, కాళింగిదిబ్బ, పాముల్లంక, కనిగిరిలంక, తదితర గ్రామాలకు సమీపంలో నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ గ్రామాల ప్రజలను వరదనీరు పెరుగుతోందని, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ కుసుమకుమారి హెచ్చరికలు జారీ చేశారు.



వీరాంజనేయస్వామి దేవస్థానం

దేవుడికే సున్నం!

- ఒక ఆలయ భూమిని కబ్జా చేసి మరో ఆలయానికి గోడ నిర్మాణం
- వైసీపీ పాలనలో అక్రమం
- మాజీ మంత్రుల కీలకపాత్ర

ఒకప్పుడు గుడులవాడగా ప్రాచుర్యం పొందిన గుడివాడలో నేడు గుడుల స్థలాలు ఆక్రమణల గుండంలో చిక్కుకుంటున్నాయి. దేవుడి స్థలాలను, పొలాలను వ్యక్తులు ఆక్రమించుకోవడం చూశాం. కానీ గుడివాడలో ఒక దేవుడి స్థలాన్ని మరో దేవుడు ఆక్రమించుకోవడం సంచలనంగా మారింది. ఈ ఘనత వైసీపీ నేతలకు దక్కింది. స్థానిక వీరాంజనేయ స్వామి ఆలయానికి చెందిన స్థలాన్ని వేణుగోపాల స్వామి ఆలయం ఆధ్వర్యంలో ఆక్రమించి అడ్డుగోడ కట్టారు. ఈ ఆక్రమం వెనుక గత ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులు ఉన్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గుడివాడ : స్థానిక వీరాంజనేయస్వామి దేవస్థానానికి పట్టణ నడిబొడ్డులో రూ.కోట్ల విలువైన ఖాళీ స్థలం ఉంది. పక్కనే ఉన్న వేణుగోపాలస్వామి దేవస్థానం ఆనాటి ధర్మకర్తల మండలి చైర్మన్ దుడ్డు వెంకటేశ్వరరావు (చిన్నా) ఆధ్వర్యంలో కాలక్షేప మండపాన్ని నిర్మించాలని భావించారు. ఆ దేవస్థానానికి చెందిన భూమి పక్కనే వీరాంజనేయస్వామి ఆలయానికి చెందిన సుమారు 150 గజాల స్థలాన్ని సైతం ఆక్రమించి మండపాన్ని నిర్మించారు. తమ స్థలాన్ని వేణుగోపాలస్వామి దేవస్థానంతో పాటు మరికొందరు ఆక్రమించారని, కాపాడాలని వీరాంజనేయస్వామి దేవస్థాన వంశపార్యంపర ధర్మకర్త తుమ్మలపల్లి పరేష్ ఆనాటి దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ కలింగిరి శాంతి దృష్టికి తీసుకువెళ్లినా చర్యల్లేవు.

మాజీ మంత్రులు కొడాలి, వెలంపల్లి నిర్వాకంతోనే..

భూ కబ్జా వెనుక ఆనాటి మంత్రులు వెలంపల్లి శ్రీనివాస్, కొడాలి నానీ ఉండటంతో దేవదాయ శాఖ అధికారులు ఉన్నతాధికారులకు సమాచారమిచ్చినా ఫలితం లేకుండా పోయింది. కేవలం వెలంపల్లి సామాజికవర్గానికి చెందిన వ్యక్తి దేవస్థాన చైర్మన్‌గా ఉండటంతో ఎటువంటి చర్యలూ తీసుకోలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. అప్పటి సహాయ కమిషనర్ వైసీపీ నాయకులు చెప్పిన విధంగా నడుచుకున్నారని, అందుకే కబ్జా స్థలం విషయంలో మౌనంగా ఉన్నారని ఆరోపణలున్నాయి.



ఆక్రమిత స్థలంలో అడ్డంగా నిర్మించిన గోడ

స్థలం అప్పగించే వరకు పోరాడతా

కోట్లాది రూపాయలు విలువైన దేవస్థాన భూమి కబ్జాకు గురైనట్టు దేవదాయ శాఖ అధికారులు, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయింది. గుడివాడలో ఏకంగా వేణుగోపాలస్వామిని ఆక్రమణదారుడిగా మార్చిన ఘనత అప్పటి రాష్ట్ర మంత్రి కొడాలి నాని, ఆనాటి ధర్మకర్తల మండలి చైర్మన్ దుడ్డు చిన్నాలకే దక్కుతుంది. ఆక్రమణలో ఉన్న స్థలం కొంత భాగాన్ని దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని దేవస్థానానికి అప్పగించారు. వేణుగోపాలస్వామి దేవస్థాన ఆక్రమణలో ఉన్న స్థలాన్ని తిరిగి తమ ఆలయానికి అప్పగించే వరకు న్యాయపోరాటం చేస్తా

- తుమ్మలపల్లి పరేష్,
వీరాంజనేయస్వామి దేవస్థాన
వంశపారంపర్య ధర్మకర్త

పాడిరైతులకు రూ.13.5 కోట్ల బోనస్

- కృష్ణామిల్క్ యూనియన్ మొదటి విడత విడుదల
- చైర్మన్ చలసాని ఆంజనేయులు వెల్లడి



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 8 : అత్యధిక పాలసేకరణ ధర చెల్లించడంతో పాటు ముందస్తు బోనస్‌లు చెల్లిస్తూ పాడిరైతు కుటుంబాల అభివృద్ధే ధ్యేయంగా కృష్ణామిల్క్ యూనియన్ కృషి చేస్తుందని చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. పాడి రైతులకు మొదటి విడత 4 నెలల కాలానికి ముందస్తు బోనస్‌గా రూ.13.5 కోట్లు గురువారం విడుదల చేశారు. ఇందులో భాగంగా హనుమాన్‌జంక్షన్ పాల శీతలకేంద్ర పరిధిలోని పాల సొసైటీలకు కోటీ 57 లక్షలా 48 వేల 148 రూపాయల బోనస్ విడుదల చేశారు. పాడిరైతు కుటుంబాల సంక్షేమానికి కళ్యాణమస్తు లాంటి పథకాల ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ పాలసేకరణ పెంచేందుకు మేలుజాతి పశువుల ఉత్పత్తికి సబ్సిడీపై సెమన్‌ను, పశువుల సంక్షేమానికి మొబైల్ వైద్య సౌకర్యం కల్పిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంద్రాగస్టు వేడుకలకు ప్రత్యేక అతిథిగా చల్లపల్లి సర్పంచ్

- న్యూఢిల్లీ(ఎర్రకోట)లో జరిగే వేడుకలకు ఆహ్వానం
- రాష్ట్రం నుంచి ఎన్నికైన ఇద్దరు సర్పంచ్‌ల్లో కృష్ణకుమారి ఒకరు

6లో..



కానూరు జిల్లా పరిషత్ హైస్కూలులో జరిగిన ఎన్నికల పరిశీలనలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ

1360 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవం

- మూడు పాఠశాలల్లో నిలిపివేత

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 8 : జిల్లాలో మూడు పాఠశాలలు మినహా మిగిలిన 1360 పాఠశాలల్లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికలు రాజకీయాలకు సంబంధంలేదని అధికారులు పైకి చెబుతున్నప్పటికీ అధికార పార్టీకి చెందిన నాయకులే పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నికయ్యారు. ఎక్కువ గ్రామాల్లో టీడీపీ, జనసేన మద్దతు తెలిపిన తల్లిదండ్రులే ఎన్నికయారు. మూడు గ్రామాల్లోని పాఠశాలల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. జిల్లాలో 993 ప్రాథమిక పాఠశాలలు ఉండగా ఒక ప్రాథమిక పాఠశాలలో ఎన్నికలు నిలచిపోయాయి. 155 ప్రాథమికోన్నత పాఠశాలలకుగాను ఒక పాఠశాలలో ఎన్నికలు నిలిచిపోయాయి. 215 ఉన్నత పాఠశాలలకు ఒక పాఠశాలలో ఎన్నికలు నిలిచిపోయాయి. గూడూరు మండలం మల్లవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు జరుగుతున్నప్పుడు వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో ఎన్నికలు నిలిచిపోయాయి. నాగాయలంక మండలం బర్లలంక ప్రాథమిక పాఠశాలలో ఎన్నికల సమయంలో వాగ్వివాదం చోటుచేసుకోవడంతో వాయిదా వేశారు. గుడివాడ మండలం తటివర్రు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎన్నికలు జరగలేదు. ఈ మూడు పాఠశాలల్లో వాగ్వివాదాలు ఏర్పడటంతో అధికారులు ఎన్నికలు నిర్వహించలేక వాయిదా వేశారు.

● అభివృద్ధిలో కమిటీ భాగస్వామ్యం కావాలి

మచిలీపట్నంలో నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల ప్రక్రియను సమగ్ర శిక్షా ప్రాజెక్టు ఆఫీసర్ రాములునాయక్, సీఎంవో రమేష్ సందర్శించారు. చిలకలపూడి నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలను, జార్జి కార్నేషన్ హైస్కూల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రక్రియను ప్రాజెక్టు ఆఫీసర్ సందర్శించారు. పాఠశాల యాజమాన్య కమిటీ ప్రతినిధులు పాఠశాలకు చెందిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పీవో రాములు నాయక్ పిలుపునిచ్చారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేలోగా విద్యా వలంటీర్లను నియమించుకునే అధికారం పాఠశాల యాజమాన్య కమిటీలకు ఉందన్నారు.



వరద చుట్టుముట్టడంతో భవానీ ద్వీపం ఇలా..

భవానీ ద్వీపం మూసివేత

భారీగా వరద చుట్టుముట్టడం వల్లే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణానదికి వరద పోటెత్తడంతో భవానీ ద్వీపాన్ని గురువారం మూసివేశారు. బోటింగ్ కార్యకలాపాలు కూడా నిలిచిపోయాయి. బోధిసిరి డబుల్ డెక్ క్రూయిజర్‌తో పాటు మెకనైజ్‌డ్ బోట్లు, పాంటూన్ బోట్లు, స్పీడ్ బోట్లను తీరంలో నిలిపేశారు. భవానీ ద్వీపాన్ని వరద చుట్టుముట్టి, జెట్టీకి కాస్త దిగువ వరకూ ప్రవాహం నడుస్తోంది. ద్వీపంలో రెస్టారెంట్‌ను ముందుగా మూసివేసి, ఆన్‌లైన్ లావాదేవీలు ఆపేశారు. ద్వీపంలోని విలువైన సామాగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు, రిసెప్షన్, గ్రౌండ్ రెస్టారెంట్లలోని సామాన్లను, గేమింగ్ జోన్‌లోని పనిముట్లను, కాటేజీల్లోని ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలను జాగ్రత్త చేస్తున్నారు. వరద ప్రవాహం పెరిగితే బెర్మ్‌పార్క్ కూడా నీటి ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. దీంతో ఏపీటీడీసీ విజయవాడ డివిజన్ అధికారులు అప్రమత్తమయ్యారు. భవానీ ఐల్యాండ్‌ను పరిశీలించిన ఏపీటీడీసీ విజయవాడ డివిజనల్ మేనేజర్ చైతన్య ఆ తర్వాత నాగార్జున సాగర్‌కు బయల్దేరారు. అక్కడి ఎత్తిపోతల ప్రాజెక్టు కూడా విజయవాడ డివిజన్ పరిధిలోనే ఉండటంతో పరిస్థితిని సమీక్షించేందుకు వెళ్లారు. కాగా, ద్వీపం వద్ద గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. వీరు ద్వీపంలోకి వెళ్లేందుకు ఒక బోటును సిద్ధం చేశారు. వరద ప్రవాహం నేపథ్యంలో భారీగా చెత్తతో పాటు విషసర్పాలు వచ్చే అవకాశం ఉండటంతో జాగ్రత్తగా ఉండాలని గజ ఈతగాళ్లకు ఏపీటీడీసీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఏనుగుల కోడు.. రైతుల గోడు!

- వరి పొలాల్లోకి చేరుతోన్న డ్రెయిన్ మురుగు
- లబోదిబోమంటున్న వల్లూరుపాలెం అన్నదాతలు
- రూ.14.73 లక్షలతో అసంపూర్తిగా గుర్రపుడెక్క తొలగింపు

6లో..

పంద్రాగస్టు వేడుకలకు ప్రత్యేక అతిథిగా చల్లపల్లి సర్పంచ్

- న్యూఢిల్లీ(ఎర్రకోట)లో జరిగే వేడుకలకు ఆహ్వానం
- రాష్ట్రం నుంచి ఎంపికైన ఇద్దరు సర్పంచ్‌ల్లో కృష్ణకుమారి ఒకరు



చల్లపల్లి, ఆగస్టు 8 : న్యూఢిల్లీ ఎర్రకోటలో ఈనెల 15వ తేదీన జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారికి ప్రత్యేక అతిథిగా ఆహ్వానం అందింది. రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ సంస్థ ద్వారా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సర్పంచ్ కృష్ణకుమారి పాల్గొనను న్నారు. పంద్రాగస్టు వేడులకు రాష్ట్రం నుంచి ఐదుగురు మహిళా ప్రజాప్రతినిధులను ప్రత్యేక అతిథులుగా పంచాయతీరాజ్ శాఖ ఎంపిక చే సింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ డైరెక్టర్ వీఆర్ కృష్ణతేజ మైలవరపు ఉత్తర్వులు అందించారు.

రాష్ట్రం నుంచి ఐదుగురిలో కృష్ణకుమారి ఒకరు

ఎర్రకోటలో పంద్రాగస్టు వేడుకలకు రాష్ట్రం నుంచి మహిళా ప్రజాప్రతినిధుల్లో చల్లపల్లి సర్పంచ్ కృష్ణకుమారి, అల్లూరి సీతారామరాజు జిల్లా మినుములూరు సర్పంచ్ లంకెలి చిట్టమ్మ, అనంతపురం జిల్లా గోళ్ల సర్పంచ్ బి.కవితలను, పశ్చిమ గోదావరి జిల్లాలో వీరవాసరం ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, గుంటూరు జడ్పీచైర్‌పర్సన్ కె.హెనీ క్రిస్టీనాలు ఎంపికయ్యారు. విద్యావంతురాలైన సర్పంచ్ కృష్ణకుమారి గతంలో జడ్పీటీసీగా పనిచేశారు.

సుపరిపాలన, క్లీన్ అండ్ గ్రీన్ అంశాల ప్రాతిపదికన చల్లపల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఓడీఎఫ్ ప్లస్‌గా ఉండటం, ప్రతి రోజూ చెత్తసేకరణ, పరిశుభ్రత, తాగునీటి సరఫరా తదితర అంశాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. ఎంపికైన ప్రజాప్రతినిధులు భర్తతో కలిసి వేడుకల్లో పాల్గొనేందుకు పంచాయతీరాజ్‌శాఖ ఏర్పాట్లు చేసింది.

14వ తేదీన ఢిల్లీలోని జన్‌పథ్‌లో డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగే 'పాజిటివ్ ఇంపాక్ట్ ఆఫ్ వుమెన్ లీడర్‌షిప్ ఇన్ పంచాయతీ' జాతీయ వర్క్‌షాపులో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి పాల్గొంటారు. అనంతరం తీన్‌మూర్తి మార్గ్‌లోని ప్రధాన మంత్రి సంగ్రహాలయను సందర్శిస్తారు. 15వ తేదీ ఉదయం ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక అతిథిగా పాల్గొంటారు.

సాగు నీరు విడుదల చేయండి

- మంత్రి నిమ్మలకు ఎమ్మెల్యే వసంత వినతి



జి.కొండూరు, ఆగస్టు 8: నాగార్జున సాగర్ నుంచి సముద్రంలోకి మళ్లిస్తున్న సాగునీటిని ఎన్ఎ స్పీ మూడో జోన్‌కు మళ్లించి మైలవరం నియోజక వర్గ పరిధిలోని చెరువులను నింపాలని ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కోరారు. గురువారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్యతో కలిసి వసంత అమరావతి సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, నియోజకవర్గంలో చాలా చెరువులు ఇప్పటికీ నిండలేదని, మెట్ట ప్రాంతానికి సాగర్ జలాల అవసరం ఎంతో ఉందని, మాగాణి సాగు ఆలస్యం కాకుండా ఉంటాలంటే సాగర్ జలాలను వృథాగా పోకుండా చెరువులకు మళ్లించుకోవడం ఉత్తమమని గుర్తు చేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

పేద అర్చకులు దరఖాస్తు చేసుకోవాలి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 8 : ప్రైవేటు ఆలయాల్లో పనిచేస్తున్న పేద అర్చకులకు సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చిందని.. అర్చకులు తమ దరఖాస్తులను ఆంధ్ర జాతీయ కళాశాల ఆవరణలో ఉన్న దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని టీడీపీ కృష్ణాజిల్లా బ్రాహ్మణ సాధికారిక సమితి కన్వీనర్ పీవీ ఫణికుమార్ తెలిపారు. ప్రైవేటు ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు ఆర్థిక సాయం అందించేందుకు చంద్రబాబు ముందుకు రావడం అభినందనీయని, ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరిలకు కృతజ్ఞతలు తెలిపారు.



ఆదీవాసీల దినోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి, పక్కన కలెక్టర్ సృజన, జేసీ నిధి మీనా తదితరులు

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి చర్యలు

- నేడు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలు
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ సృజన

కృష్ణలంక, ఆగస్టు 8 : గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసి సమాజంలో సమానత్వాన్ని కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఈ సందర్భంగా అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు గిరిజన, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న వేడుకల ఏర్పాట్లను గురువారం మంత్రి సంధ్యారాణి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన, జేసీ నిధి మీనా, ఇతర అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే ఆదివాసీ దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచ్చేస్తారని, గిరిజన నృత్యాలను తిలకించి, గిరిజన ఉత్పత్తుల స్టాల్స్‌ను పరిశీలిస్తారన్నారు. ఆదివాసీలతో మమేకమై వారి స్థితిగతులను అడిగి తెలుసుకొని గిరిజనుల అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల సమక్షంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు మంత్రి సంధ్యారాణి తెలిపారు. మంత్రి వెంట గిరిజన సంక్షేమ కార్యదర్శి కె.కన్నబాబు, కలెక్టర్ సృజన, జేసీ నిధి మీనా, నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యాన చంద్ర, ఆర్డీవో సీహెచ్ భవానీశంకర్, జిల్లా గిరిజనసంక్షేమ అధికారి జె.సునీత వున్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ బాలాజీ, న్యాయమూర్తి చినబాబు, అధికారులు

లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠినచర్యలు

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : స్కానింగ్ కేంద్రాలలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, అతిక్రమించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టర్ చాంబరులో గురువారం ప్రీకన్షెప్షన్ అండ్ ప్రీనాటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ చట్టంపై జిల్లాస్థాయి సమావేశం జరిగింది. పదో అదనపు జిల్లా జడ్జి ఎస్.చినబాబుతో కలిసి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్కానింగ్ కేంద్రాలపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. వైద్య అధికారులు బృందాలుగా ఏర్పడి తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. న్యాయమూర్తి చినబాబు మాట్లాడుతూ, జనాభాలో స్త్రీ, పురుషుల నిష్పత్తిలో వ్యత్యాసంపై క్షేత్రస్థాయిలో వైద్యశాఖ సిబ్బంది ప్రజలకు కనీస అవగాహన కల్పించాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి మాట్లాడుతూ, జిల్లాలో 87 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, తెలిపారు. ఏఎస్పీ ప్రసాద్, గైనకాలజిస్ట్ ఎంకేవీ లక్ష్మీ, స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధి కొరెడ్ల సుశీల తదిరులు పాల్గొన్నారు.

హెరిటేజ్ కార్యాలయానికి నారా బ్రాహ్మణి

పెనమలూరు, ఆగస్టు 8 : స్థానిక ప్రధాన రోడ్డులోని హెరిటేజ్ కార్యాలయానికి మంత్రి నారా లోకేశ్ సతీమణి, సంస్థ బాధ్యులు నారా బ్రాహ్మణి గురువారం వచ్చారు. కనీసం 3 గంటలు కార్యాలయంలో గడిపిన ఆమె సిబ్బంది, అధికారులతో సమావేశమై సంస్థ అభివృద్ధికి పలు సూచనలు చేశారు.



ముంపు ముంగిట..

కృష్ణమ్మకు వరద పోటు.. భయం గుప్పెట్లో లంక గ్రామాల ప్రజలు

- పులిగడ్డ వద్ద తొమ్మిది అడుగులకు వరద నీరు
- శుక్రవారం నాటికి అక్విడెక్ట్‌ను తాకే అవకాశం
- బిక్కు బిక్కుమంటున్న ప్రజలు



వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ

అవనిగడ్డ/అవనిగడ్డ రూరల్, ఆగస్టు 8 : ఎగువన ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తిసామర్థ్యంతో నిండిపోవటంతో ప్రకాశం బ్యారేజీ నుంచి దాదాపు 2 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయటంతో కృష్ణానది పరవళ్లు తొక్కుతూ సాగరుడితో సంగమించేందుకు పోటెత్తింది. బుధవారం ఉదయం విడుదల చేసిన నీరు ఇప్పటికే పులిగడ్డ వద్ద రెండుగా చీలి నాగాయలంక, కోడూరు మండలాల వైపు ప్రవహిస్తుండగా, పులిగడ్డ వద్ద ఇప్పటికే నీటిమట్టం తొమ్మిది అడుగులకు చేరింది. వరద ఉధృతి కొనసాగుతుండటంతో కృష్ణానదీ గర్భంలోని లంకలపైకి నీరు చేరుతుండగా,



నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం వద్ద ఉధృతంగా..

శుక్రవారం ఉదయానికి మరింత వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని, దీని కారణంగా పాత ఎడ్లంక కాజ్‌వే పైకి నీరు చేరే అవకాశాలు ఉన్నాయని ఇరిగేషన్ డిఈ రావెళ్ల రవికిరణ్ తెలిపారు. గురువారం విడుదల చేసిన సుమారుగా 3 లక్షల క్యూసెక్కుల నీరు శనివారం నాటికి ఈ ప్రాంతానికి చేరుకుంటుందని, శనివారం నుంచి వరద క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని డీఈ తెలిపారు. కృష్ణానదికి వచ్చిన వరదలు చూసేందుకు పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద, నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం వద్దకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు.



ఇసుకను బస్తాల్లో తరలిస్తున్న సిబ్బంది

తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పులిగడ్డ ఆక్విడెక్ట్ పరిసర ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని రెవెన్యూ, పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద వరద పరిస్థితిని ఇరిగేషన్ ఈఈ గంగయ్య గురువారం సాయంత్రం పరిశీలించారు. వరద పరిస్థితిని డీఈ రావెళ్ల రవికిరణ్ ఆయనకు వివరించారు. వరద ఉధృతి పెరిగితే ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఈఈ ఆదేశించారు. పాత ఎడ్లంక కాజ్‌వే వద్ద అవనిగడ్డ ఎస్‌ఐ శ్రీనివాస్ గురువారం సాయంత్రం వరద పరిస్థితిని పరిశీలించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

నాగాయలంక : కృష్ణాకు వరద పోటెత్తుతున్న దృష్ట్యా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం సూచించారు. గురువారం నాగాయలంక వద్ద లోతట్టు ప్రాంతాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు.



కరకట్టల పటిష్టతకు చర్యలు

మోపిదేవి : కృష్ణానదికి వరద ఉధృతి పెరుగుతుండటంతో లంక గ్రామాల్లో కరకట్టల పటిష్టతకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు. మండలంలోని నాగాయితిప్ప, కోసూరువారిపాలెం, ఉత్తర చిరువోలులంక, అయోధ్య గ్రామాల వద్ద కోతకు గురైన కరకట్టలపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్‌సీ డీఈ భానుబాబు పర్యవేక్షణలో మోపిదేవిలోని స్టాక్ పాయింట్ నుంచి ఇసుక బస్తాలను కరకట్టలు కోతకు గురైన ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తున్నారు.

లంక గ్రామాల్లో పడవలపై ప్రయాణం..

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మండలం కృష్ణా పాయలకు గురువారం వరద ఉధృతి పెరిగింది. గురువారం 3లక్షల 10వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలినట్టు డిప్యూటీ తహసీల్దార్ టి.ధనలక్ష్మి తెలిపారు. సాయంత్రం ఆర్డీవో రాజు మండలంలో పర్యటించి వరద తీవ్రతను పరిశీలించారు. రేవుల వద్ద అప్రమత్తంగా ఉండాలని, లంక గ్రామాల ప్రజలకు అవసరమైన సహాయ చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. పడవలపై లంక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.

పడవపై తోట్లవల్లూరు వస్తున్న పాములలంక ప్రజలు

మునేరుకు వరద పోటు

వత్సవాయి : పోలంపల్లి ఆనకట్ట వద్ద ఎగువ నుంచి వస్తున్న వరదతో పరవళ్లు తొక్కుతోంది. మునేరు ఉధృతికి నదీ పరివాహక ప్రాంతాలైన ఇందుగుపల్లి, కన్నెవీడు. పోచవరం, గంగవల్లి, అల్లూరుపాడు తదితర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు నదీ ప్రవాహాన్ని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నదీ ప్రవాహం నిలకడగా ఉన్నట్టు మునేరు ఆయకట్టు ఏఈ నరసింహ తెలిపారు.



ఎగువనుంచి వస్తున్న వరదతో పరవళ్లు తొక్కుతున్న మునేరు

ఏనుగుల కోడు.. రైతుల గోడు!

- వరి పొలాల్లోకి చేరుతోన్న డ్రెయిన్ మురుగు
- లబోదిబోమంటున్న వల్లూరుపాలెం అన్నదాతలు
- అసంపూర్తిగా గుర్రపుడెక్క తొలగింపు పనులపై అసహనం

తోట్లవల్లూరు, ఆగస్టు 8 : ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల తీరు వల్లూరుపాలెం రైతులకు శాపంలా మారింది. ప్రభుత్వ నిధులతో కాంట్రాక్టరుతో సక్రమంగా పని చేయించలేకపోతున్నారు. పని సగంలోనే వదిలేయటంతో ఏనుగులకోడుడ్రైన్ మురుగు రివర్స్‌లో ఎగదన్ని వరిచేలను ముంచేస్తోంది. గురువారం వల్లూరుపాలెం రైతులు కాంట్రాక్టరు తీయకుండా వదిలేసిన గుర్రపుడెక్కను చూపుతూ మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు.



పొలాల్లోకి చేరిన మురుగు

అసంపూర్తి పనులతో వరికి తీవ్ర నష్టం..

తాడిగడప నుంచి పత్తేలంక వరకు 23 కిలోమీటర్ల పొడవున ఏనుగులకోడు డ్రెయిన్ విస్తరించి ఉంది. పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు, పమిడిముక్కల తదితర మండలల్లో వేలాది ఎకరాల్లో మురుగును బయటకు చేరవేస్తుంది. ఈ ఏడాది రూ. 14.73 లక్షల కాంట్రాక్టుతో తాడిగడప నుంచి వల్లూరుపాలెం వరకు గుర్రపుడెక్కను తొలగించారు. వల్లూరుపాలెం నుంచి దిగువకు డెక్క తొలగింపు చేయకుండా అసంపూర్తిగా వదిలేశారని వల్లూరుపాలెం రైతులు కాట్రగడ్డ సాయి, కాట్రగడ్డ రవి, జమ్మలమూడి నాగరాజు, సువర్ణగంటి శంకర్ తదితరులు ఆరోపిస్తున్నారు. ఎగువ నుంచి వచ్చిన మురుగు వల్లూరుపాలెం వద్ద స్తంభించిపోవటంతో కట్ట మీదుగా వరిపొలాల్లోకి ప్రవేశిస్తోందని.. ఇప్పటికే మురుగు వల్ల రెండు సార్లు వరినాట్లు దెబ్బతిన్నాయని ఒక్కో ఎకరానికి రూ. 30 వేలు ఖర్చుపెట్టి నాట్లు వేశామన్నారు. వల్లూరుపాలెం వద్ద వందల ఎకరాలపై మురుగు ప్రభావం ఉందని చెప్పారు. తక్షణం డెక్క తొలగించకుంటే వరినాట్లు మూడోసారి కూడా దెబ్బతింటాయని రైతులు వాపోతున్నారు.



వల్లూరుపాలెం వద్ద ఏనుగుల కోడు డ్రెయిన్‌లో దట్టంగా పెరిగిన గుర్రపుడెక్కను చూపుతున్న రైతులు

మార్చి వరకు డెక్కతొలగించవచ్చు : ఏఈ మణికంఠ

జూలై 20న గుర్రపుడెక్క తొలగింపునకు అగ్రిమెంటు కుదిరిందని, 9వ కిలోమీటరు నుంచి 23వ కిలో మీటరు వరకు గడ్డిపరక లేకుండా చేశాం, వల్లూరుపాలెం వద్ద కట్ట ఎత్తుగా ఉండటంతో గుర్రపుడెక్క తీయటానికి వీలుపడలేదన్నారు. వచ్చే మార్చి వరకు పనులు చేయవచ్చు.

కొరవడిన నిఘా!

- సరిహద్దులో పెచ్చుమీరుతున్న అసాంఘిక శక్తులు..
- యథేచ్ఛగా మద్యం, గంజాయి రవాణా



అష్టలక్ష్మి ఆలయ సమీపంలో నిఘా లేని బోర్డర్ చెక్‌పోస్టు

తిరువూరు : పట్టణ శివారుల్లోని ఆంధ్ర-తెలంగాణ సరిహద్దులో ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టుల వద్ద, సిబ్బంది లేకపోవడంతో అసాంఘిక శక్తులు యథేశ్ఛగా పట్టణంలోకి ప్రవేశిస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో తిరువూరు, భద్రాచలం బైపాస్ రోడ్డులో, అష్టలక్ష్మీ ఆలయం వద్ద, మునుకుళ్ల, అక్కపాలెం, కోకిలంపాడు, వావిలాల, నూజివీడు రోడ్డులో కాకర్ల వద్ద సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటుతో పాటు, పోలీసు నిఘా నిరంతరం కొనసాగేది. ప్రస్తుతం చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

మద్యం, గంజాయి అక్రమ రవాణా..

సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద పోలీసు బందోబస్తు లేకపోవడంతో తెలంగాణ ప్రాంతం నుంచి ఆకతాయిలు, మద్యం, గంజాయి పట్టణంలోకి తెస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణ శివారులో ఆర్టీఏ చెక్‌పోస్టు తొలగించడంతో, బహిరంగంగానే ఇసుక టిప్పర్లు పెద్దసంఖ్యలో తెలంగాణకు ఇసుక రవాణ చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. పట్టణంలోని బైపాస్ జంక్షన్, ఒక ప్రైవేటు వెంచర్, కోకిలంపాడు జంక్షన్, మల్లమ్మచెరువు రోడ్డు ప్రాంతాలను అడ్డాగా చేసుకొని కొందరు గంజాయి విక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం.

గతంలో ఇంటర్ విద్యార్థి, గంజాయికి అలవాటు పడి చదువుకు దూరమవడం పాటు, ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వ్యక్తులు ప్రట్టణంలోకి ప్రవేశించి, పలు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ వైద్యశాల వద్ద వరుస బైక్ దొంగతనాలు జరిగాయి.

కట్టడి చర్యల్లో అధికారులు విఫలం..

పట్టణంలో పలు ప్రాంతాల్లో నిషేధిత మత్తుపదార్థాలు విక్రయిస్తున్నా అరికట్టడంలో, అధికారులు శ్రద్ధచూపడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సదస్సులు నిర్వహించడం మినహా, పట్టణంలో అసాంఘిక శక్తుల్ని నిలువరించడంలో అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని స్థానికులు విమర్శిస్తున్నారు. పట్టణ సరిహద్దులో అధికారులు నిఘా ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

- సెక్టర్-1ఎస్సై సత్యనారాయణ

బోర్డర్ చెక్‌పోస్టులతో పాటు పట్టణంలో పోలీసు నిఘా కొనసాగిస్తాం. ఎన్నికలు, ఇతర సందర్భాలలో చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉండేది. పట్టణంలో ఎవరైనా అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎంపెడా సభ్యునిగా ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : సముద్ర ఉత్పత్తులు, ఎగుమదుల అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఎంపెడా) సభ్యుడిగా మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఎన్నికయ్యారు. ఈ పదవికి తొలుత ఐదుగురు ఎంపీలు పోటీపడగా ముగ్గురు వైదొలిగారు. కేంద్ర వాణిజ్యశాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఎంపెడా విభాగం సభ్యునిగా ఎన్నికైన ఎంపీ వల్లభనేనిని పలువురు అభినందించారు.

అంగన్వాడీలకు సొంత భవనాలు

- ఎంపీ శివనాథ్ వినతి

న్యూఢిల్లీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): విజయవాడ పార్లమెంట్ పరిధిలోని 1457 అంగన్‌వాడీల్లో 892 కేంద్రాలకు సొంత భవనాలు లేవని, వాటికి సొంత భవనాలు నిర్మించాలని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవికి ఎంపీ కేశినేని శివనాథ్ విజ్ఞప్తి చేశారు. గురువారం కేంద్రమంత్రిని శివనాథ్ కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

పవన్‌ను కలిసిన ఎస్పీ



గన్నవరం : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం బెంగళూరు నుంచి గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన పవన్ కళ్యాణ్‌కు ఎస్పీ మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రోడ్డు మార్గాన పవన్ మంగళగిరి వెళ్లారు.

ఆక్వాటిక్‌లో యజ్ఞసాయికి మెడల్

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 8: ఒడిశా రాష్ట్రం కళింగపట్నం స్టేడియంలో జరుగుతున్న నేషనల్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో జిల్లా స్విమ్మర్ సబ్ జూనియర్ విభాగంలో 800 మీటర్ల ఫ్రీ స్టయిల్‌లో ఎం.యజ్ఞసాయి 8.54.20 సెకన్లలో ఈది రజతంతో సత్తా చాటాడు. తొలుత 400 మీటర్లలో ఫ్రీ స్టయిల్‌లో రజతాన్ని యజ్ఞసాయి కైవసం చేసుకున్న విషయం తెల్సిందే. ఈ మెడల్‌తో వరుసగా రెండు రజతాలను తన ఖాతాలో వేసుకున్నాడు. పాట్నా ఎమ్మెల్యే అఖిలాష్ చంద్ర, ఒడిశా ఆక్వాటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రదీప్ పాటిల్ మెడల్ అందించి అభినందించినట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ ఐ.రమేష్ తెలిపారు.

3 కేజీల బంగారు ఆభరణాలు స్వాధీనం

పాయకాపురం, ఆగస్టు 8 : బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 3.336 కేజీల బంగారు ఆభరణాలను గురువారం నున్న రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కారు సహా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా నున్న రూరల్ పోలీసులు ఉదయం పాయకాపురం శివారుల్లోని ఇన్నర్‌రింగ్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో నూజివీడు నుంచి నగరంలోకి వస్తున్న ఏపీ 40 బీబీ 8282 నెంబరు గల కారులో బంగారు ఆభరణాలను గుర్తించారు. వీటికి సరైన పత్రాలు లేకపోవడంతో కారు, ఆభరణాలను స్వాధీనం చేసుకుని రవీంద్రబాబు, అంజిబాబులను అదుపులోకి తీసుకున్నారు. వీరు నూజివీడులో బంగారపు దుకాణాన్ని నిర్వహిస్తున్నారని ఆభరణాలను అక్కడి నుంచి నగరంలోని బంగారం షాపునకు తీసుకువెళ్తున్నట్టు తెలిసింది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	92, 101, 112
చికెన్ విత్ స్కిన్	178
చికెన్ స్కిన్‌లెస్	188

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.30

ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను కలిసిన సీఐలు



పెనమలూరు, ఆగస్టు 8 : నియోజకవర్గంలోని పెనమలూరు, ఉయ్యూరు సీఐలుగా బాధ్యతలు చేపట్టిన వెంకటరమణ, టీవీవీ రామారావు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో శాంతి భద్రతలు కాపాడడంలో ముందుండాలని ఎమ్మెల్యే సీఐలకు సూచించారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డీలర్లు

రేషన్ డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

గన్నవరం: వైసీపీ ప్రభుత్వం రేషన్ డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసిందని రేషన్ డీలర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీహెచ్ ఖాసీం, గౌరవ అధ్యక్షుడు కస్తూరి అప్పారావు అన్నారు. తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో రేషన్, సరుకుల పంపిణీ డీలర్స్ ద్వారానే జరుగుతుందని ప్రకటించిన సీఎం చంద్రబాబు చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీలర్స్‌ను పక్కనపెట్టి ఎండీయుల ద్వారా రేషన్ పంపిణీ చేయించటం ద్వారా డీలర్స్ ఆర్థిగా నష్టపోయి కూలి పనులు చేసుకోవాల్సిన పరిస్థితిని ఏర్పడిందన్నారు. డీలర్స్ వ్యవస్థను బలోపేతం చేస్తామని చంద్రబాబు ప్రకటించటంపై ఆనందం వ్యక్తంచేశారు. ఎస్.వి.ఎస్. కృష్ణా, శేఖర్, జోజప్ప, కిషోర్, బుజ్జారావు, కోటేశ్వరరావు, మాణిక్యాలరావు, ధనలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

బుద్దదేవ్ భట్టాచార్యకు నివాళి

ఉయ్యూరు: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్దదేవ్ భట్టాచార్య మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎం.హరిబాబు అన్నారు. పార్టీ కార్యా లయంలో గురువారం భట్టాచార్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. నాయకులు కె.శివనాగేంద్రం, బి.రాజేశ్, బి.కీర్తి, కోటేశ్వరరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించాలి

గన్నవరం: రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు పని సర్దుబాటుకు ముందే, స్కూల్ అసిస్టెంట్‌లను ప్రధానోపాధ్యాయులుగా, సెకండరీ ఉపాధ్యాయులను స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు కల్పించిన తరువాతే సర్దుబాటు కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే జీవో నెంబర్ 117ను రద్దు చేస్తామని నారా లోకేష్ బహిరంగ లేఖ ద్వారా ఉపాధ్యాయ వర్గానికి హామీ ఇచ్చారన్నారు. దానిని అమలు చేయాలని కోరారు. మండల అధ్యక్ష కార్యదర్శి ఎం.ఆనంద్‌కుమార్, ఆర్ ఆనంద్‌కుమార్, సీహెచ్ కృష్ణారావు, బి.శ్రీధర్, బి.సురేష్ పాల్గొన్నారు.

ఆప్కాబ్ బ్యాంకులో పంట రుణాలు

హనుమాన్‌జంక్షన్: ఆప్కాబ్ బ్యాంకు ద్వారా రైతులకు దీర్ఘ, స్వల్పకాలిక పంట రుణాలు అందిస్తున్నట్లు హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్ మేనేజర్ బి.తేజ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఖాతాదారులకు బంగారం మీద, కమర్షియల్, గృహ, వ్యక్తిగత రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. పంట రుణాలు రైతులకు అతి తక్కువ వడ్డీపై అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెనమలూరు: వణుకూరు శివారు లేఅవుట్ల వద్ద పేకాడుతున్న పదకొండు మంది వ్యక్తులను పెనమలూరు పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ. రెండు లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వెంకటరమణ తెలిపారు.

కక్షతోనే తొలగించారు

● పేటేటి కిషోర్ మాదిగ

గన్నవరం: కక్ష పూరితంగానే తనను ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా తొలగించారని పేటేటి కిషోర్ మాదిగ ఆరోపించారు. విలేకర్లతో గురువారం మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్‌ను అడ్డుపెట్టుకుని మందా వెంకటేశ్వరరావు, మందా వేణు అరాచకాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తనను సస్పెండ్ చేసే అధికారం ఒక్క మంద కృష్ణ మాదిగకు తప్ప మరెవరికి లేదన్నారు. ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావాలని విశేష ప్రచారం చేశామన్నారు. తాము చేసిన పనిని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గుర్తించి అభినందనలు కూడా తెలిపారన్నారు. వాళ్లే టీడీపీ కార్యాలయాన్ని ధ్వంసం చేసిన వైసీపీ నాయకులతో తిరుగుతున్నారని ఆరోపించారు. ఈ నెల 13న హైదరాబాద్‌లో జరిగే కృష్ణమాదిగ సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. అదే రోజు ఇక్కడ జరిగే పరిణామాలను కృష్ణమాదిగ దృష్టికి తీసుకువెళతానని కిషోర్ తెలిపారు. కలపాల వికాస్, పులపాక విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాకమిటీల ఎన్నికలు ప్రశాంతం

హనుమాన్ జంక్షన్ రూరల్, హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 8: బాపులపాడు మండలంలోని 64 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు బాపులపాడు ఎంఈవో రాంబాలసింగ్ తెలిపారు. 8 ప్రాథమిక పాఠశాలలు, 8 ఉన్నత పాఠశాలలు, 48 మండల పరిషత్, ఎయిడెడ్, జిల్లా పరిషత్ యాజమాన్యాల ఆధీనంలోని పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించినట్టు తెలిపారు. తహసీల్దార్ నాగభూషణం, ఎంపీడీవో రత్నకుమారి, వీరవల్లి ఎస్సై చిరంజీవి, వీఆర్‌వోలు ఎన్నికలు పూర్తిచేసి విజేతలతో ప్రమాణస్వీకారం చేయించారు. అబ్జర్వర్‌గా రాంబాబు వ్యవహరించారు. వీరవల్లి హైస్కూల్‌కు చైర్మన్‌గా నానిబాబు, వైస్ చైర్‌పర్సన్‌గా చందు వరలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యుడిగా గుండపనేని ఉమావరప్రసాద్ ఎన్నికైనట్టు హెచ్‌ఎం నిర్మల తెలిపారు. కార్యవర్గాన్ని ఎంపీటీసీ సభ్యుడు అమృతపల్లి సూర్యనారాయణ, ఉప సర్పంచ్ లంక అజయ్‌కుమార్ అభినందించారు. ఆరుగొలను హైస్కూల్ చైర్‌పర్సన్‌గా గోగులమూడి సృజన, వైస్ చైర్మన్‌గా కోలవెంటి సురేష్ ఎన్నికయ్యారు. రేమల్లె హైస్కూల్ చైర్మన్‌గా సొదిమెళ్ల శ్యామ్, వైస్ చైర్‌పర్సన్‌గా పరికల శైలజ ఎన్నికయ్యారు. కానుమోలు హైస్కూల్ చైర్మన్‌గా తల్లిబోయిన రామారావు, వైస్‌చైర్‌పర్సన్‌గా చిన్నం అరుణకుమారి ఎన్నికయ్యారు. రంగన్నగూడెం ఎంపీయూపీ స్కూల్ చైర్మన్‌గా నత్తా అబ్రహం, వైస్ చైర్మన్‌గా దేవరకొండ తిరుమల ఎన్నికయ్యారు. వేలేరు, మల్లవల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించి ఎన్నికైన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యత, మౌలిక సదుపాయాల కల్పన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల బాధ్యతని ఎంఈవో రాంబాలాసింగ్ అన్నారు. వేలేరు హైస్కూల్ హెచ్‌ఎం విజయ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఎస్ఎంసీ సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ స్కూల్ మౌలికసదుపాయాల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వేలేరు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేములపల్లి శ్రీనివాసరావు, కమిటీ చైర్మన్ బుర్రె రజని, వైస్ చైర్మన్ మళావతుల లక్ష్మి పాల్గొన్నారు.

బాపులపాడులో..



బాపులపాడు జడ్పీ హైస్కూల్ కమిటీ చైర్మన్‌గా వై.శ్రీనివాసరావు, వైస్ చైర్‌పర్సన్‌గా వి.నాగదుర్గ ఎన్నికయ్యారు. ఎంఈవో బి.సురేష్‌కుమార్, పీడీ వి. వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గన్నవరంలో..

గన్నవరం: మండలంలో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ముస్తాబాద జడ్పీహైస్కూల్ఎస్ఎంసీ చైర్మన్‌గా షేక్ ముస్తఫావలి, వైస్ చైర్‌పర్సన్‌గా పిరంపల్లి వాణీ ఏ కగ్రీవంగా ఎన్నికయ్యారు. గన్నవరం బాలుర ఉన్న త పాఠశాల చైర్‌పర్సన్‌గా చోరగుడి ఎస్తేరు సుచరి త, వైస్ చైర్మన్‌గా రత్నబాబు ఎన్నికయ్యారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: మండలంలోని 48 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన విద్యాకమిటీల ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని ఎంఈవో-2 జె.సాంబశివరావు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పట్ల అవగాహన లోపంతో ఒకటి, రెండుచోట్ల స్వల్ప వాదోపవాదాలు జరగడం తప్ప అన్ని పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించారన్నారు. 32 ఎంపీపీ పాఠశాలలకు తొమ్మిది ఏకగ్రీవమైనట్టు తెలిపారు. ఉంగుటూరు హైస్కూల్ చైర్మన్‌గా పులి శ్రీనివాసరావు, వైస్ చైర్‌పర్సన్‌గా తోడేటి రోజా, పొట్టిపాడు హైస్కూల్ చైర్మన్‌గా కాండ్రు రమేష్, వైస్ చైర్‌పర్సన్‌గా సీహెచ్‌సావిత్రి, తేలప్రోలు హైస్కూల్ చైర్మన్‌గా అడిగర్ల పైడితల్లి, వైస్ చైర్మన్‌గా గుడేటి స్టాలిన్‌బాబు, ఆత్కూరు హైస్కూల్ పి.సాంబశివరావు, కేజీఎస్ సింధూరి, వెల్దిపాడు సీహెచ్‌దుర్గారావు, జి.సౌజన్య, మానికొండ హైస్కూల్ టి.అరుణకుమారి, డొక్కు రమేష్, తరిగొప్పల హైస్కూల్ షేక్ హసీన్‌బీ, కె.దివ్య, ఇందుపల్లి హైస్కూల్ సీహెచ్ లక్ష్మి, టి.కమలభాస్కర్, పెదఅవుటపల్లి హైస్కూల్ దాసరి జ్యోతి, కొడాలి రవికుమార్ ఎన్నికయ్యారు.

పెనమలూరులో..





పెనమలూరు: స్థానిక ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ కమిటీ ఏకగ్రీవమైంది. పాఠశాల యాజమాన్య కమిటీకి చైర్‌పర్సన్‌గా ఎస్.కె. కైరూన్‌బీ, వైస్ చైర్‌పర్సన్‌గా కె.లక్ష్మీ, కో-ఆప్షన్ సభ్యులుగా కంచర్ల శ్రీనివాసరావు, కిలారు శివకుమార్, కిలారు బ్రహ్మ జీ ఎన్నికైనట్టు హెచ్‌ఎం దుర్గాభవాని తెలిపారు.

కంకిపాడులో..

కంకిపాడు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో ఎస్.వి.వి.ప్రసాద్ తెలిపారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని 46 ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్య కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎ న్నికలు నిర్వహించామన్నారు. నిర్వహణకు తోడ్పడిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉయ్యూరులో..



మద్దాలి రమేశ్‌ను అభినందిస్తున్న టీడీపీ నేతలు పాలడుగు సత్యనారాయణ, జ్ఞానశేఖర్

ఉయ్యూరు: మండల పరిధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ముదునూరు జడ్పీహెచ్ఎస్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మద్దాలి రమేశ్, వైస్ చైర్మన్‌గా చోరగుడి పద్మ ఎన్నికయ్యారు, గ్రామానికి చెందిన టీడీపీ నేతలు పాలడుగు సత్యనారాయణ, సర్పంచ్ మొవ్వ వెంకట నాగలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు జ్ఞానశేఖర్, పల్లపోతు శ్రీనివాసరావు, తెలుగు యువత నేత పాలడుగు ప్రసాద్, జనసేన నేత దాకారపు అజయ్ తదితరులు రమేశ్‌తోపాటు కమిటీని అభినందించారు. చిన ఓగిరాల పాఠశాల చైర్ పర్సన్‌గా పి.నిర్మలరాజు, వైస్‌చైర్మన్‌గా వత్సవాయి వెంకట రమణ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కాటూరు జడ్పీహైస్కూల్ చైర్‌పర్సన్ యేహోషువ, వైస్ చైర్మన్ కొడాలి సుకన్య, ఆకునూరు ప్రభుత్వ పాఠశాలలో మరీదు శ్రీధర్, పొనుమాటి సునీత, ఉయ్యూరులో ఆరేపల్లి శివసాయిప్రాద్, కొల్లి విజయలక్ష్మి, పెదఓగిరాలలో బొకి నాల కేజియా, మరీదు వెంకటసుబ్బారావు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లుగా ఎన్నికయ్యారు. ఉయ్యూరులో కమిటీ ఎన్నికలను ఎంఈవో తాహెరా సుల్తానా, ఎంఈవో -2 సుధారాణి పర్యవేక్షించారు.

గ్రామస్థుల సహకారంతోనే అభివృద్ధి

● ఎమ్మెల్యే బోడె ప్రసాద్



కంకిపాడు, ఆగస్టు 8: గ్రామాభివృద్ధి, గ్రామస్థుల సహకారంతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కోలవెన్ను గ్రామానికి చెందిన తుమ్మల అజయ్‌బాబు, సత్యవరప్రసాద్ (చిన్న పండు), అడుసుమిల్లు కుమార్, తుమ్మల బుడి, పరివెల కేశవరావు కుమారులు, ముక్కాముల శ్రీనివాసు, ఉపసర్పంచ్ చిన్ని, గ్రామస్థుల సహకారంతో నిర్మించిన కల్యాణ మండపాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే కోలవెన్నులో గ్రామస్థుల సహకారంతో సుమారు 82 రోడ్లు అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజ, కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, అనుమోలు ప్రభాకర్ రావు, గ్రామపెద్దలు తుమ్మల జగదీష్, కంచర్ల శేషగిరి, పరివెల సుబ్బారావు, టీడీపీ, జనసేన సమన్వయకర్త ముప్పా రాజా, మాజీ సీహెచ్‌సీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు, కొప్పరాజు సురేష్, రామ్‌లక్ష్మణ్, విజయ్, కళ్యాణి పాల్గొన్నారు.

కమిషనర్ శానిటేషన్ పరిశీలన

పెనమలూరు, ఆగస్టు 8: తాడిగడప మునిసిపాలిటీ పరిధిలోని కార్మికనగర్ కట్ట, తాడిగడప కూడలి బస్టాప్ వెనుక ఆక్రమిత బడ్డీకొట్ల వద్ద గురువారం కమిషనరు వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. తాడిగడప సెంటరులో ఆక్రమణలు చేసిన బడ్డీకొట్లను తొలిగించవలసిందిగా సిబ్బందిని ఆదేశించారు.

డ్రెయిన్‌లో పూడికతీత పనుల పరిశీలన



ఉయ్యూరు: పట్టణంలో ప్రధాన రహదారి వెంబడి మెయిన్ డ్రైన్ పూడికతీత పను లను నరగపంచాయతీ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పి.వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపధ్యంలో డ్రైన్ల పూడిక తీత ప నులు చేపట్టాలన్న ప్రభుత్వ ఆదేశాల మేర పూడిక తీతపనులు చేపట్టారు.





మునిగిన శివాలయం, మద్దూరు వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్, సర్పంచ్

పెరుగుతున్న వరద ఉధృతి

కంకిపాడు, ఆగస్టు 8: వరద ఉధృతి పెరుగుతుండటంతో మండలంలోని కృష్ణ నదీ పరివాహక ప్రాంతంలో అధికారులు అప్రమత్తంగా ఉండలాని తహసీల్దార్ భవన్నారాయణ హెచ్చరించారు. మద్దూరు, కాసరనేనివారిపాలెం ఏరిధిలోని కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణా నది నుంచి సుమారు 3.10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారన్నారు. చేపల వేటకు వెళ్ల వద్దు అని సూచించారు. హెచ్చరిక బోర్డులతో పాటు రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ సంబంధిత శాఖల అధికారులతో పర్యవేక్షణ చేస్తున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజ, వీఆర్వో బి.నాగిరెడ్డి, మద్దూరు సర్పంచ్ చిప్పల దాసు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన శివాలయం

కాసరనేనివారి పాలెం, మద్దూరు పరిధిలోని శివాలయాలు నీట మునిగాయి. సర్పంచులు, పంచాయతీ అధికారులు సైతం నీటిపాయిలో ప్రజలు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.



సీఐ హబీబ్‌బాషా, ఎస్సై గణేశ్‌కుమార్‌ను సత్కరిస్తున్న పోలీస్ సిబ్బంది

సీఐ, ఎస్సైలకు ఘనంగా వీడ్కోలు

ఉయ్యూరు, ఆగస్టు 8: విధినిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేసి ప్రజలు, సిబ్బంది మన్ననలు పొందడం అభినంద నీయమని పమిడిముక్కల సీఐ కిషోర్‌కుమార్ అన్నారు. ఉయ్యూరు పట్టణ సీఐ, ఎస్సై గా పనిచేసి బదిలీపై వె ళుతున్న ఎండి హబీబ్ బాష, గణేశ్‌కుమార్‌కు పట్టణస్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశ ం ఏర్పాటుచేసి పుష్పగుచ్ఛాలు, శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిధిగా పమిడిముక్కల సీఐ కిషోర్‌కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సర్వ సాదారణమని, విధి నిర్వహణలో అందరిని మెప్పించడం సాధ్యంకాదన్నారు. ఉయ్యా రులో విధులు నిర్వహించిన హబీబ్ బాష, గణేశ్‌కుమార్ తక్కువ కాలంలో సమర్థవంతంగా పనిచేసి సిబ్బంది మన్ననలు పొందారన్నారు. కంకిపాడు సీఐ శ్రీనివాస్, పట్టణ ఏఎస్ఐ రమేశ్, హెడ్‌కానిస్టేబుళ్లు పావులూరి రవి, వీరంకి రాము, శ్రీనివాసరెడ్డి, సి బ్బంది బదిలీపై వెళుతున్న సీఐ, ఎస్సైకు ఘనంగా వీడ్కోలు పలికారు.

మెగా రక్తదాన శిబిరం విజయవంతం



పెనమలూరు, ఆగస్టు 8: సెంట్రల్ జీఎస్టీ విభాగం, రెడ్ క్రాస్‌తో కలిసిక కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల డీమ్డ్ టుబి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రక్తదానం అనేది ప్రాణాలను రక్షించే నిస్వార్థ చర్య అని, సేవా విలువలను ప్రతిబింబిస్తుందన్నారు. కళాశాల డీన్ పాండురంగారావు మాట్లాడుతూ పీవీపీ, సిద్ధార్థ కళాశాలలకు సంబంధించిన ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్, సీజీఎస్టీ యూనిట్లకు, ఎన్ఎస్ఎస్ యూనిట్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు కొల్లా నరేంద్ర, శ్యాం, శ్రీనివాసరావు, బాలకొండయ్య, భాస్కరరావు, రాం బాలాజీ, శివప్రసాద్ పాల్గొన్నారు.



ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో..

ఉంగుటూరు, ఆగస్టు 8: రక్తదానం చేయడం ప్రతి ఒక్కరూ ఒక బాధ్యతలా భావించాలని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్ అన్నారు. విజయవాడ సెంట్రల్ జీఎస్టీ డివిజన్, అమెరికన్ క్యాన్సర్ కేర్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో, ఎన్ఎస్ఎస్ విభాగం సహకారంతో గురువారం కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రమాదాల బారినపడిన ఎంతోమంది సకాలంలో రక్తం లభించక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని సూచించారు. ఒక వ్యక్తి ఇచ్చే యూనిట్ రక్తం, అత్యవసర పరిస్థితుల్లో వున్న ముగ్గురు వ్యక్తులకు పునర్జన్మను ప్రసాదిస్తుందన్నారు. రక్తదానం ఆవశ్యకతపై విద్యార్థుల్లో అవగాహన పెంచి, చైతన్యపరిచేందుకు ప్రతి ఏటా రెండుసార్లు కళాశాలలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో కళాశాలకు చెందిన 164మంది విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ జీఎస్టీ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, క్యాన్సర్ కేర్ సెంటర్ వైద్యులు డాక్టర్ తులసీరామ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.హరిబాబు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



కానూరు యూనియన్ బ్యాంకు వద్ద ప్రయాణికుల అవస్థలు

కానూరు ప్రధాన రహదారిపై
ప్రయాణం నరకప్రాయం

రోడ్డుపై వర్షపు నీళ్లు నిల్వతో వాహనదారుల ఇబ్బందులు

యూనియన్ బ్యాంకు, కెనడీ స్కూల్ వద్ద ట్రాఫిక్‌కు అడ్డంకులు

రోడ్డు ధ్వంసం, 4 నెలలకొకసారి రోడ్డు ఛిద్రం

పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు

పెనమలూరు, ఆగస్టు 8: కానూరు ప్రధాన రోడ్డు వాహనదారులకు, ప్రయాణికులకు, విద్యార్థులకు నిత్యం నరకం చూపుతోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై నీళ్లు నిలచిపోయాయి. దాంతో ఎక్కడెక్కడ గోతులున్నాయో తెలియక ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. కానూరు ప్రధాన రహదారికి కార్పొరేట్ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, అకాడమీలు కొలువుదీరడంతో ఉదయాన్నే ప్రధాన రహదారిపై ట్రాఫిక్ అధికంగా ఉంటుంది. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలు, కళాశాలలకు తీసుకెళ్లే క్రమంలో ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. కానూరు ప్రధాన రోడ్డును కలుపుతూ నవతా కంపెనీ మీదుగా వెళ్లే రోడ్డు ఒక ప్రక్క ఆటోనగర్‌ను, తులసీనగర్ మీదుగా ఏలూరు రోడ్డును అనుసంధానిస్తోంది. ప్రతిరోజూ వేలకొద్ది కార్మికులు, వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. మరోప్రక్క పంటకాల్వ రోడ్డుపై పోలీసు పర్యవేక్షణ కొరవడడంతో ఎక్కడికక్కడ లారీలు, ట్రక్కులు పార్కు చేసి ఉండడంతో ప్రయాణికులు చుక్కలు చూస్తున్నారు. రోడ్డును కనీస ఎత్తుకు పెంచి డ్రెయినేజీ వ్యవస్థను ఆధునీకరించడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాలకులు, అధికారులు శాశ్వత పరిష్కారం దిశన ఆలోచన చేయాలని ప్రజలు కోరుతున్నారు. తాడిగడప మునిసిపాలిటీలోని నాలుగు క్లస్టర్లలో ఏ క్లస్టరుకూ దాపురించని ఇబ్బందులు కానూరు క్లస్టరుకు దాపురించడం పట్ల గ్రామస్థులు పెదవి విరుస్తున్నారు. కానూరు ప్రధాన రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	92, 101, 112
చికెన్ విత్ స్కిన్	178
చికెన్ స్కిన్‌లెస్	188

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ.4.30

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండిగిన్నె బహూకరణ



మోపిదేవి, ఆగస్టు 8: సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విజయవాడకు చెందిన బిట్ర పూజ్య శ్రీ పేరున ఆమె తండ్రి చంద్రశేఖర్ వెండి గిన్నెను కానుకగా అందజేశారు. గురువారం ఆలయానికి విచ్చేసి స్వామిని దర్శించుకుని ఆయన విశేష పూజలు చేశారు. కేజీ 400 గ్రాముల బరువు గల వెండి గిన్నెను ఆలయ ఈవో ఎన్.ఎస్.చక్రధరరావుకు అందజేశారు.

బోనస్ పంపిణీ

గుడ్లవల్లేరు, ఆగస్టు 8: పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ కార్యక్రమం గురువారం వేమవరం పాల కేంద్రంలో నిర్వహించారు. రూ.61 వేలు బోనస్ పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు అబ్దుల్ బషీర్, గుడ్లవల్లేరు పాలశీతల కేంద్రం మేనేజర్ పాల్గొన్నారు.



జడ్పీ సీఈవో ఆనందబాబును సన్మానిస్తున్న సర్పంచ్‌లు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

● సర్పంచ్‌లు, కార్యదర్శులకు జడ్పీ సీఈవో ఆనందబాబు సూచన

చల్లపల్లి, ఆగస్టు 8: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పరిషత్ సీఈవో పి.ఆనందబాబు సూచించారు. వెలుగు కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా సీఈవో పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామీణాభివృద్ధిశాఖపై ప్రత్యేక దృష్టి సారించారని, సురక్షిత తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆయన సూచించారు. సర్పంచ్‌ల అధికారాలు, విధులను వివరించారు. డీఎల్‌పీవో ఐ.జ్యోతిర్మయి, ఇన్‌చార్జి ఎంపీడీవో బూరేపల్లి అశోక్‌కుమార్, సర్పంచ్‌లు పైడిపాముల కృష్ణకుమారి, కొల్లూరి కోటేశ్వరరావు, డొక్కు నాగేశ్వరరావు, యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్, వల్లూరి ఉమా, కార్యదర్శులు పాల్గొన్నారు.

● **పమిడిముక్కల:** మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ తరగతులను జిల్లా పరిషత్ సీఈవో ఆనందరావు గురువారం ప్రారంభించారు. ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధమైన పాలనతోనే పంచాయతీల అభివృద్ధి



పామర్రులో శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీపీవో నాగేశ్వర్‌నాయక్

పామర్రు: ప్రణాళికాబద్ధమైన పాలనతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా పంచాయతీ అధికారి ఎస్వీ నాగేశ్వర్ నాయక్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను డీపీవో ప్రారంభించారు. ఎంపీడీవో ఎం.భారతి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● **పెడన రూరల్:** మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ తరగతులను డీపీవో నాగేశ్వరనాయక్ ప్రారంభించారు. గ్రామ పంచాయతీల ప్రణాళిక, అభివృద్ధిపై శిక్షకులు పర్వతుల్లా, శివ నాగేశ్వరరావు, హదీ వివరించారు. ఎండీవో వి.రెడ్డయ్య, ఈవోఆర్డీ జయరామ, సర్పంచులు బొడ్డు చిలబాబు, ఉచ్చుల భాస్కరరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

● **గుడివాడ రూరల్:** మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, సర్పంచ్‌లకు మూడు రోజుల శిక్షణను ఎంపీడీవో ఎ.జ్యోతి ప్రారంభించారు. జడ్పీటీసీ గోళ్ల రామకృష్ణ, ఆర్.డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, అభివృద్ధి అధికారి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన అవసరం

మోపిదేవి: పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని మచిలీపట్నం డీఎల్పీవో జ్యోతిర్మయి సూచించారు. సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణ తరగతులను మండల పరిషత్ కార్యాలయంలో ఆమె ప్రారంభించారు. వైస్ ఎంపీపీ నడకుదుటి జనసీకుమారి, ఇన్‌చార్జి ఎంపీడీవో రామలింగేశ్వరరావు, రీసోర్స్ పర్సన్ పి.వి.మాధవేంద్రరావులు శిక్షణ ఇచ్చారు.

సీఎంసీ ఫండ్ కోసం నిరసన

నందివాడ, ఆగస్టు 8: సీఎంసీ ఫండ్ బిల్లుల చెల్లించాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల శిక్షణలో మొదటి రోజున వెంకట రామాపురం సర్పంచ్ కాకరాల సురేష్ మండల పరిషత్ సమావేశపు హాలులో నిరసన తెలిపారు. జీఎస్టీ ఫండ్ వివరాలు పంచాయతీ అధికారులకు తెలియక సక్రమంగా బిల్లులు చెల్లించటం లేదన్నారు. అధికారుల వద్ద ఎన్నిసార్లు మొత్తుకున్నా పంచాయతీ కార్యదర్శులు కాలయాపన చేయటం వల్ల ఈ నిరసన తెలియజేస్తున్నానన్నారు. దీనిపై మండల పంచాయతీ విస్తరణ అధికారిని వివరణ కోరగా.. సీఎంసీ ఫండ్ బిల్లులు గురించి తమ దృష్టికి రాలేదన్నారు. ఇప్పుడే తెలిసిందని, అధికారులతో మాట్లాడి బిల్లులు చెల్లించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

విద్యుత్ అధికారుల విజిలెన్స్ తనిఖీలు

● 285 సర్వీసులకు రూ.8,20,000 జరిమానా

ఘంటసాల, ఆగస్టు 8: మండలంలో విద్యుత్ వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఆక్వా చెరువులపై విద్యుత్ శాఖ ఈఈ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు, సిబ్బంది 31 బృందాలుగా ఏర్పడి 1608 గృహ సర్వీసులు, 77 వాణిజ్య సముదాయాలు, 7 ఆక్వా సర్వీసులను తనిఖీ చేశారు. గురువారం ఘంటసాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు వివరాలు వెల్లడించారు. అదనపు లోడు వినియోగిస్తున్న 285 సర్వీసులకు రూ.8,20,000 రుసుము విధించామని తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగితే 9440812362, 9440812363, 8331014951కు సమాచారం ఇవ్వాలని సూచించారు. తనిఖీల్లో చల్లపల్లి డీఈఈ పి.ఎస్.నాగేశ్వరరావు, ఉయ్యూరు డీఈఈ ఎం.రామకృష్ణ, అవనిగడ్డ డీఈఈ ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఘంటసాల ఏఈ పి.రవికుమార్, ఉయ్యూరు డివిజన్ పరిధిలోని ఏఈలు, జేఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఈ- పంట నమోదు తప్పనిసరి

ఘంటసాల, ఆగస్టు 8: ప్రతీ రైతు ఖరీఫ్ -2024 పంట కాలంలో సాగు చేసిన పంట పూర్తి వివరాలను పంట రకంతో సహా వివరంగా రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా 'ఈ-పంట'లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.మురళీకృష్ణ సూచించారు. బోళ్లపాడులో ఈ-పంట నమోదును ఆయన పరిశీలించారు. కొత్త వరి వంగడాలను సాగు చేసే రైతులకు ధాన్యం సేకరణ సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండటానికి ఈ-పంట నమోదు సమయంలోనే వరి రకం వివరాలను వీఏఏకు తెలియజేయాలని ఆయన సూచించారు. వీఏఏ బి.దిలీప్, రైతులు రావెలపల్లి సతీష్, గొర్రెపాటి రత్నగిరిరావు పాల్గొన్నారు.

సజావుగా ఎస్‌ఎంసీ ఎన్నికలు

విద్యాశాఖ ఆదేశాలతో పాఠశాలల్లో నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు గురువారం సజావుగా జరిగాయి. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు చొప్పున సభ్యులను ఎంపిక చేసి వారి నుంచి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు. ఎన్నికలను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిర్వహించారు.

ఎన్నికైన పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు



వెంకటాపురం హైస్కూల్‌లో కమిటీ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఉపాధ్యాయులు, తోట్లవల్లూరు హైస్కూల్‌లో చైర్మన్, వైస్ చైర్మన్లను అభినందిస్తున్న తల్లులు, టీడీపీ నాయకులు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 8: జార్జికార్పొరేషన్ హైస్కూల్‌లో నిర్వహించిన ఎన్నికల్లో బి.రోహిణి చైర్‌పర్సన్‌గా, బి.జ్యోతి వైస్‌చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ప్రక్రియను సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీరాములు నాయక్ పరిశీలించారు. చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్ చైర్మన్‌గా పి.సతీష్, వైస్‌చైర్మన్‌గా వై.అరుణ ఎన్నికయ్యారు. రాములునాయక్ పరిశీలించారు. బందరు మండలం గోపువానిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత, తపసిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. వి.కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా ఈమన ప్రభాకర్ (ఏసు), వైస్‌చైర్మన్‌గా మోకా వెంకటేశ్వరమ్మ ఎన్నికయ్యారు. ఎన్నికను మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ పరిశీలించారు. గూడూరు మండలం ఎంపీయూపీ పాఠశాల చైర్మన్‌గా కె.చినహుల్లక్కి, వైస్ చైర్మన్‌గా జి.కీర్తి ఎన్నికయ్యారు. చిన్నాపురం హైస్కూల్ చైర్మన్‌గా కేశన వెంకట కృష్ణారావు, వైస్‌చైర్మన్‌గా కంచర్లపల్లి లక్ష్మీకళ ఎన్నికయ్యారు.

● **అవనిగడ్డ రూరల్:** అశ్వారావుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా కటికల బాలాజీ, ఉపాధ్యక్షురాలిగా కరుణకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధానోపాధ్యాయుడు రేపల్లె శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **మోపిదేవి:** మండలంలోని 42 పాఠశాలలకు 40 పాఠశాలల్లో కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. కె.కొత్తపాలెం శివారు ఉత్తరపాలెం ప్రాథమిక పాఠశాల, మోపిదేవి బీసీ బాలుర గురుకుల పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. ఎంఈవో దుర్గాసాగర్ పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికలో మోపిదేవి హైస్కూల్ కమిటీ చైర్‌పర్సన్‌గా సీహెచ్ లక్ష్మి, వైస్ చైర్మన్‌గా కిషోర్, వెంకటాపురం జడ్పీ పాఠశాల చైర్మన్‌గా వీరవెంకట బాలాజీ, వైస్ చైర్మన్‌గా కనకదుర్గ ఎన్నికయ్యారు.

● **కూచిపూడి:** మొవ్వ మండలంలోని 58 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. కూచిపూడి, భట్లపెనుమర్రు, పెదసనగల్లు, చినముత్తేవి, నిడుమోలు, కాజ, కోసూరు, మొవ్వ, పెదముత్తేవి జడ్పీ పాఠశాలలు, పెదపూడి, మంత్రిపాలెం, నిడుమోలు యూపీ పాఠశాలలతో పాటు 46 ఎలిమెంటరీ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు.

● **పామర్రు:** మండలంలో ప్రభుత్వ, ఎయిడెడ్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఈవో జి.పద్మావాణి తెలిపారు. 60 పాఠశాలల్లో ఏకగ్రీవంగా చైర్మన్లు ఎన్నికయ్యారన్నారు. నిమ్మకూరు గురుకుల పాఠశాల చైర్మన్‌గా ఎం.అంబేద్కర్, వైస్ చైర్మన్‌గా ఆర్.సాయిభవ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

● **గుడివాడ రూరల్:** బిళ్లపాడు ఉన్నత పాఠశాల చైర్మన్ బొజ్జర్లపూడి రాణి, వైస్ చైర్మన్‌గా పామర్తి కృష్ణను ఎన్నుకున్నారు. బొమ్ములూరు యూపీ పాఠశాలలో చైర్మన్‌గా ఊసా రమేష్(నవీన్), వైస్ చైర్మన్‌గా జి.సీతను ఎన్నుకున్నారు. బొమ్ములూరు మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ ఆధ్వర్యంలో ప్యానల్ గెలుపొందింది. సైదేపూడి ప్రాథమిక పాఠశాలలో కఠారి చంద్రశేఖర్‌ను చైర్మన్‌గా ఎన్నుకున్నారు.

● **పెడన రూరల్:** పెనుమల్లి హైస్కూల్‌కు కాట్రగడ్డ నాగరాజు, చెన్నూరు హైస్కూల్‌కు ఉదయగిరి రాఘవయ్య, నందిగం హైస్కూల్‌కు పోలగాని నాగబాబు, ఉరివి పాఠశాలకు అర్జా సోమయ్య, నందమూరులో కట్టా రామాంజనేయులు, కాకర్లమూడిలో బెల్లంకొండ నాంచారయ్య, గౌడపాలెంలో యడవల్లి రేవతి, కొంకేపూడిలో పామర్తి నాగదివ్య ఎన్నికయ్యారు.



బిళ్లనపల్లి హైస్కూల్‌లో..

● **నందివాడ:** మండలంలో 43 పాఠశాలలుంటే, 16 పాఠశాలల్లో 15 మంది కంటే తక్కువ పిల్లలు ఉన్నారని, దీంతో విద్యార్థుల తల్లిదండ్రులే సభ్యులని ఎంఈవో డేవిడ్ రత్నరాజు తెలిపారు. 27 పాఠశాలల్లో కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారని ఎన్నుకున్నారని తెలిపారు.

● **పెడన:** ఎంఈవో-2 వై.వి.హరనాథ్ పర్యవేక్షణలో 51 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలల్లో కమిటీ ఎన్నికలు జరిగాయి. పట్టణంలోని భట్ట జ్ఞానకోటయ్య హైస్కూల్ కమిటీ చైర్మన్‌గా హేమగిరి నాగేంద్రరావు, వైస్‌చైర్మన్‌గా బండార్లంక శ్రీదేవి, బంగ్లా స్కూల్ చైర్మన్‌గా సీహెచ్ సుధారాణి, వైస్‌చైర్మన్‌గా ఎండీ బాబు, దక్షిణ తెలుగుపాలెం పాఠశాల చైర్మన్‌గా ఓడెం సీతారామరాజు, వైస్‌చైర్మన్‌గా పేరే లక్ష్మి, తోటమూల హైస్కూల్ కమిటీ చైర్మన్ పదవికి బొడ్డు శ్రీలత, పోసిన వెంకట బుజ్జిబాబు పోటీపడ్డారు. శ్రీలతకు మద్దతుగా 8 మంది, పోసిన వెంకట బుజ్జిబాబుకు మద్దతుగా 12 మంది సభ్యులు చేతులెత్తారు. చైర్మన్‌గా వెంకట బుజ్జిబాబు ఎన్నికయ్యారు. శ్రీలతను వైస్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గూడూరు మండలం ఆకుమర్రు ఎంపీయూపీ స్కూల్ చైర్మన్ వరిగంజి వెంకటేశ్వరరావు, వైస్‌చైర్మన్‌గా బొల్లా పావని ఎన్నికయ్యారు.

● **కృత్తివెన్ను:** మండలంలో లక్ష్మీపురం హైస్కూల్‌లో మాత్రమే ఎన్నిక నిర్వహించారు. మిగిలిన అన్ని పాఠశాలల్లో ఏకగ్రీవంగా కమిటీలు ఎన్నుకున్నారు. లక్ష్మీపురం హైస్కూల్ కమిటీ చైర్మన్‌గా కొప్పర్తి భాస్కరరావు, వైస్ చైర్మన్‌గా గొడవర్తి శ్రీదేవిలు విజయం సాధించారు.

టీడీపీ సానుభూతిపరుల విజయం

తోట్లవల్లూరు: మండలంలోని 36 పాఠశాలల్లో టీడీపీ సానుభూతిపరులు విజయం సాధించారు. తోట్లవల్లూరు హైస్కూల్ చైర్మన్‌గా వల్లూరు సుజాత, వైస్ చైర్మన్‌గా ఫాతిమున్నీసా, పెనమకూరు హైస్కూల్ చైర్మన్‌గా గుండాల సంతోష్‌రాణి, వైస్ చైర్మన్‌గా ఎండీ రిజ్వాన్, వల్లూరుపాలెం హైస్కూల్ చైర్మన్‌గా బడుగు రమాదేవి, వైస్ చైర్మన్‌గా నాగదేశి సునీత, దేవరపల్లి హైస్కూల్ చైర్మన్‌గా దేవరపల్లి రాజేష్, వైస్ చైర్మన్‌గా మరీదు లక్ష్మి, 32 యూపీ స్కూళ్లకు చైర్మన్లు, వైస్ చైర్మన్లు ఎన్నికయ్యారని ఎంఈవో వెంకటేశ్వరరావు తెలిపారు.



అఖిలపక్ష సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దాం

● రాజకీయ పార్టీలన్నీ కలిసి నడుద్దాం: మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, ఆగస్టు 8: "గతంలో అఖిలపక్ష పార్టీలతో కలిసి చేసిన పులిగడ్డ-పెనుమూడి వారధి ఉద్యమం, కృష్ణా డెల్టా ఉద్యమాలు కృష్ణా డెల్టా ఆధునీకరణకు, పోలవరం ప్రాజెక్టు అంకురార్పణ, పులిచింతల ప్రాజెక్టుల సాధనకు దోహదపడ్డాయి. నాడు 10 వేల మందితో డెల్టా ఉద్యమం చేస్తే అప్పటి టీడీపీ ప్రభుత్వం మాపై ఒక్క కేసు కూడా పెట్టలేదు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడినా, సమస్యలపై అర్జీ ఇచ్చేందుకు వెళ్లినా పోలీసులతో అడ్డుకుని భయానక వాతావరణం సృష్టించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టించేందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసి నడుద్దాం." అని అఖిలపక్ష నాయకులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. నియోజకవర్గ అభివృద్ధిపై గురువారం గాంధీక్షేత్రంలో వివిధ రాజకీయ పక్షాలతో ఆయన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వ అసమర్థ, అవినీతి విధానాల కారణంగా నియోజకవర్గంలో అభివృద్ధి జాడ లేకుండాపోయిందని, నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటన పయనింపచేయటమే తన లక్ష్యమని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర మంత్రుల సహకారంతో ప్రభుత్వ నిధులు, సీఎస్ఆర్ నిధులు తెచ్చేందుకు కృషి చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిరువోలు బుచ్చిరాజు హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో రహదారులకు తక్షణమే మరమ్మతులు చేయాలని, కొత్త రోడ్లు వేయాలని సీపీఐ జిల్లా నాయకుడు హనుమానుల సురేంద్ర నాథ్ బెనర్జీ సూచించారు. డ్రెయిన్లు పూడిక తీయించాలని, నియోజకవర్గంలోని అన్ని బస్టాండ్లలో రోడ్లు దెబ్బతిన్నాయని, చల్లపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, కమ్యూనల్ స్థలాలు పరిరక్షించాలని, చల్లపల్లిలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పునరుద్ధరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి అద్దాడ ప్రసాద్ కోరారు.

నిజాయితీకి నిలువుటద్దం పాటూరి రామయ్య

నీతి, నిజాయితీలకు నిలువుటద్దం మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య అని, నేటి తరం నేతలకు ఆదర్శనీయుడని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గాంధీక్షేత్రంలో అఖిలపక్ష నేతలతో కలసి పాటూరిని ఘనంగా సత్కరించారు.

రుణ విముక్తులను చేయండి



నిరసన తెలుపుతున్న టిడ్కో కాలనీవాసులు

గుడివాడ: టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు బ్యాంకర్లు నోటీసులిచ్చి దౌర్జన్యంగా వసూళ్లకు పాల్పడుతున్నారని, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రుణ విముక్తులను చేయాలని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ డిమాండ్ చేశారు. గురువారం టిడ్కో కాలనీలో కాలనీవాసులతో కలిసి ఆమె నిరసన తెలిపారు. గత ప్రభుత్వం విచారించిన 8,912 మంది లబ్ధిదారులపై తిరిగి విచారణ చేపట్టడాన్ని కమిటీ అంగీకరించదన్నారు. ఒక్క పేరు తొలగించినా ఆందోళన చేపడతామని ఆమె హెచ్చరించారు. పాఠశాలను ప్రారంభించాలని, హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, ఓవర్ హెడ్ ట్యాంకు ప్రారంభించి మంచినీటిని సరఫరా చేయాలని, సచివాలయాలను ఏర్పాటు చేయాలని, పార్కును నిర్మించాలని ఆమె డిమాండ్ చేశారు. నిరసనలో ఎం.దుర్గ, ఆదినారాయణ, రంగారావు, అప్పలనాయుడు, మాధవి, మేరమ్మ, రాజు, వై.నాగాంజనేయులు, బి.లక్ష్మి పాల్గొన్నారు.

గుడివాడ అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ: ప్రజల భాగస్వామ్యంతో సుందరమైన గుడివాడగా తీర్చిదిద్దేందుకు బృహత్తర ప్రణాళికను సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. గురువారం విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విద్యాలయ ప్రొఫెసర్లతో ఆయన భేటీ అయ్యారు. ఆర్కిటెక్చర్ విద్యాలయ నిపుణులు గుడివాడలో నిర్వహించిన సర్వే నివేదికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, గూగుల్‌మ్యాప్‌ల ద్వారా వివరించారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు, పార్కులు, ప్రజానివాసిత ప్రాంతాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణను వివరించారు. పట్టణ అభివృద్ధితో పాటు సుందరీకరణపైన దృష్టి పెట్టామని వెనిగండ్ల తెలిపారు. వచ్చే వార్షిక ఏడాదిలో గుడివాడలో పెట్టుబడులు పెట్టేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఔత్సాహికులు వస్తారని, క్లీన్ అండ్ గ్రీన్ గుడివాడగా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ ఎంఈ విజయదుర్గ, డీఈ ప్రవీణ్, ఆర్కిటెక్చర్ విద్యాలయ ప్రొఫెసర్లు, నిపుణులు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

పేర్ని నాని విమర్శలు అర్థరహితం: బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 8: మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని మతిచెడి కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని, ఆయన విమర్శలు అర్థరహితమని జనసేన మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ విమర్శించారు. గురువారం జనసేన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు విసిగిపోయారని అందుకే ఆపార్టీని దారుణంగా ఓడించారని అన్నారు. పోలీసు అధికారులను వైసీపీ నాయకులు అగౌరవంగా మాట్లాడుతున్నారన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను విమర్శించే స్థాయి వైసీపీ నాయకులకు లేదన్నారు. వైసీపీ నాయకులకు పవన్‌కల్యాణ్ సినిమా చూపించారన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ సుభాన్, స్వాధీనం చేసుకున్న కాయిన్లు

పేకాట శిబిరంపై మెరుపుదాడి

● 11 మంది అరెస్టు..రూ.5లక్షలకు సమానమైన కాయిన్స్, రూ. 47,500, తొమ్మిది బైక్‌లు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 8: చిలకలపూడి పోలీసు స్టేషన్ పరిధిలో డబ్బును కాయిన్స్‌గా మార్చుకుని కాయిన్స్ వినియోగిస్తూ నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. డీఎస్పీ అబ్దుల్ సుభాన్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నారాయణపురానికి చెందిన రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగి వెంకటేశ్వరరావు ఇంట్లో పేకాట నిర్వహిస్తున్నారని సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారన్నారు. ఈ దాడిలో 11 మందిని అరెస్టు చేశామని, వారి నుంచి రూ.47,500 నగదు, 9 బైక్‌లు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. డబ్బును కాయిన్స్ రూపంలో మార్చి పేకాట ఆడుతున్నారన్నారు. ఇలా ఈ పేకాటలో దొరికిన కాయిన్స్ విలువ రూ.5 లక్షలకు సమానమన్నారు. రెండు నెలలుగా కాయిన్స్ రూపంలో రాత్రీపగలు తేడా లేకుండా ఆడుతున్నారని, ఇంటిని క్లబ్‌లాగా మార్చేశారని డీఎస్పీ తెలిపారు. దాడిలో ఆర్‌పేట సీఐ సోమేశ్వరరావు, చిలకలపూడి సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో రాత్రి తరగతులు

● చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ఏడీకి ఎస్ఎఫ్ఐ వినతి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 8: జిల్లాలో రాత్రి 8 గంటల వరకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాయని, ఇలాంటి సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ కార్యదర్శి సమరం డిమాండ్ చేశారు. గురువారం విద్యాశాఖ ఏడీ మనోహరనాయక్‌కు ఆయన వినతిపత్రం అందించారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. యూనిఫాంలు, నోటు పుస్తకాలు ఎక్కువ రేట్లకు విక్రయిస్తున్నారన్నారు.

రక్తదానం మహాదానం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 8: రక్తదానం అన్నిదానాల్లో కన్నా గొప్పదని జీఎస్టీ అధికారిణి జి.మంగమ్మ అన్నారు. హిందూ కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జీఎస్టీ అధికారి మంగమ్మ స్వయంగా రక్తదానం చేసి విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. జీఎస్టీ ఇన్‌స్పెక్టర్ జి. శివకుమార్ పర్యవేక్షణలో డాక్టర్ వసంత వీరరాఘవయ్య, ప్రిన్సిపాల్ కుటుంబరావు, రెడ్‌క్రాస్ అధికారులు పాల్గొన్నారు.

● **గుడివాడ:** ఏఎన్నార్ కళాశాలలో విజయవాడ సెంట్రల్ జీఎస్టీ గుడివాడ రీజియన్ ఆధ్వర్యంలో తలసేమియా బాధిత చిన్నారుల కోసం ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏరియా ప్రభుత్వాస్పత్రి సహకారంతో గురువారం నిర్వహించారు. కళాశాల పాలకవర్గ కార్యదర్శి కె.ఎస్.అప్పారావు, జీఎస్టీ సూపరింటెండెంట్ ఎం.శ్రీకాంత్, కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు ఎల్.ఆర్.కె ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

బాలశౌరికి అభినందన

అవనిగడ్డ, ఆగస్టు 8: సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ సభ్యుడిగా మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఎంపికవడంపై మత్స్యకార సంఘాల రాష్ట్ర నాయకులు లకనం నాగాంజనేయులు, లంకే యుగంధర్, నాగిడి తాతారావు హర్షం వ్యక్తం చేసి, ఆయనకు అభినందనలు తెలిపారు. శుక్రవారం అవనిగడ్డలో వారు మాట్లాడారు. క్రియాశూన్యంగా ఉన్న ఎంపెడాను అభివృద్ధి పథంలో పయనించేలా, మత్స్య, ఆక్వా రంగాలకు తోడ్పాటునందించే కార్యక్రమాలు రూపొందించి అమలు జరిపేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కోడూరు తహసీల్దార్‌గా శ్రీను నాయక్

కోడూరు, ఆగస్టు 8: తహసీల్దార్‌గా బి.శ్రీనునాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కూటమి మండల నేతలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. బండే శ్రీనివాసరావు, పిల్లి మల్లికార్జునరావు, ముద్దినేని చంద్రరావు, కొక్కిలిగడ్డ జాన్‌విల్సన్, గోగినేని సోమశేఖర్‌రావు, ఉల్లి శేషగిరిరావు, బచ్చు వెంకటేష్, నాగం రఘు, బడే సాయి, కొండవీటి రామకృష్ణ, మర్రే గంగయ్య, కొండవీటి సునీత పాల్గొన్నారు.

12న కలెక్టర్‌కు వినతిపత్రం

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 8: నాగాయలంక మండలం గుల్లలమోదలోని క్షిపణి ప్రయోగ కేంద్రాన్ని గుజరాత్‌కు తరలించుకుపోతున్నారన్న వార్తలు రావటంతో తరలించొద్దంటూ ఈనెల 12వ తేదీన కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం సమర్పిస్తామని బీజేపీ నాయకుడు జి.వి.నగరాయులు తెలిపారు. నాగాయలంక మండలంలోనే క్షిపణి ప్రయోగ కేంద్రం ఉంచాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ఈనెల 12న వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. త్వరలోనే కూటమి నేతలతో కలిసి ఢిల్లీ వెళ్లి క్షిపణి కేంద్రాన్ని నాగాయలంకలో ఉంచాలని కోరనున్నట్లు నగరాయులు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

కృత్తివెన్ను, ఆగస్టు 8: ఇటీవల బ్రెయిన్ సంబంధిత వ్యాధితో మృతి చెందిన పదో తరగతి విద్యార్థి తిరుమాని కావేరి(15) కుటుంబానికి ఇమ్మానుయేల్స్ చర్చ్ మినిస్ట్రీస్ తరపున రెవరెండ్ బీవీ డేనియల్‌రాజు రూ.36,100, సంగమూడి హైస్కూల్‌కు చెందిన 1992-93 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.35,300 నగదును అందించారు. పూర్వ విద్యార్థులు మాగాపు శివప్రసాద్, చేకూరి గిరిబాబు, కొత్తపల్లి మేర్సీగ్లోరి పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 8: పెదపట్నం గ్రామానికి చెందిన పులిపాక సత్యనారాయణకు రూ.7 వేలు, ఫాతిమాకు రూ.5 వేలు, ప్రసాద్‌కు రూ.2 వేలు వైద్య ఖర్చుల కింద జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ గురువారం అందజేశారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, వంపుగడల చౌదరి, సమీర్, జొన్నల సూర్య, దివి మహేష్, కోటి నాగులు, గంపల కృష్ణ పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ర్యాలీ

గుడివాడ: ఇండియన్ బ్యాంకు 118వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులతో కలిసి ఇండియన్ బ్యాంకు నుంచి ర్యాలీ(వాకథాన్) నిర్వహించారు. ఇండియన్ బ్యాంకు లీడ్ బ్యాంక్ మేనేజర్ టి.ఎస్.జయవర్ధన్, స్థానిక బ్యాంకు మేనేజర్ పృథ్వీరాజ్, క్లస్టర్ బ్యాంకు మేనేజర్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.